క్లుప్తంగా

ఎంపీ కొండాకు సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న భాస్కరయోగి

పరిగి: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం కుల్కచర్ల మండలం పర్యటన ముగించుకుని వెళ్తున్న క్రమంలో పట్టణ కేంద్రంలోని పలువురు బీజేపీ నాయకులను కలిశారు. ఆధ్యాత్మికవేత్త, వక్త భాస్కర్‌యోగి తన నివాసంలో ఎంపీని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మిట్టపరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాఘువేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లైబ్రేరియన్ లక్ష్మప్పకు అవార్డు



అవార్డు అందుకుంటున్న లక్ష్మప్ప

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మప్ప హైదరాబాద్‌లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ చేతుల మీదుగా ఉత్తమ గ్రంథపాలకుడి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అవార్డు రావడంపై సంతోషంగా ఉందని, మరింత నిబద్ధతతో విధులు నిర్వహించి, పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

కుల్కచర్ల: కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను సీఆర్టీలుగా గుర్తించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు రాజేందర్‌నాయక్, శ్రీకాంత్‌లు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. సోమవారం కుల్కచర్లకు విచ్చేసిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. మా ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నర్సింలు, రాజు, రాములు, పెంటయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బంగ్లా

బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశం



అతిథిగృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం వెంకటేశ్వరకాలనీ సమీపంలోని అతిథిగృహానికి మరమ్మతులు చేయించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం కోరారు. ఈ మేరకు సోమవారం పలువురు బీజేపీ నాయకులతో కలిసి అతిథిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అతిథిగృహ మరమ్మతు పనులు ప్రారంభించి, పూర్తి చేయకుండానే వదిలేశారన్నారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించక పోవడంతో భవ న మరమ్మతులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. అంతేకాకుండా చీకటిపడితే భవనంలో పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, భద్రేశ్వర్ ఉన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే గట్టి పునాది

మోమిన్‌పేట: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు గట్టి పునాది వేయాలని ఎస్‌ఐ అరవింద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాళ్లగుడుపల్లి పాఠశాల విద్యార్థులకు ఉచిత టై, యూనిఫాం, బెల్టులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వచ్చి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం లాంటి వసతులు కల్పి స్తున్నా ప్రైవేటుకు దీటుగా రాణించలేకపోతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్, ప్రధానోపాధ్యాయుడు ప్రభయ్య, మొగులయ్య, విజయ, గ్రామస్తులు ఉన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!



మోత్కూర్‌లో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు(ఫైల్)

- తాళాలకే పరిమితమైన నూతన జీపీ భవనాలు
- పాత భవనాల్లోనే పాలన
- పదవీకాలం చివరిలో ప్రారంభించిన సర్పంచులు
- తెరవని పంచాయతీ అధికారులు



నూతన జీపీ భవనానికి వేసిన తాళం

దోమ : శిథిలావస్థకు చేరిన పంచాయతీలకు ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతన భవనాలు మంజూరయ్యాయి. అధికారులు ఆ భవనాల నిర్మాణాలను పూర్తి చేశారు. కాని, పంచాయతీ శాఖ అధికారులు వాటిని ప్రారంభించకుండా కాలయాపన చేశారు. సర్పంచుల పదవికాలం ముగింపు దశలో సర్పంచులు టెంకాయ కొట్టి ప్రారంభించారు. అయినా, ఆ భవనాలను తాళాలకే పరిమితం చేసి, శిథిలావస్థకు చేరిన భవనాల్లో పంచాయతీ కార్యదర్శులు పాలన సాగిస్తున్నారు.

ఒక్కొక్క జీపీకి రూ. 20 లక్షలు

దోమ మండల వ్యాప్తంగా ఐదు నూతన జీపీలకు మంజూరయ్యాయి. గుండాల, పోతిరెడ్డిపల్లి, మోత్కూర్, కొత్తపల్లి, బుద్లాపూర్ గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు కాగా, ఒక్కొక్క భవనానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ. 20 లక్షల వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. రూ. లక్షలు వెచ్చించి భవనాలను నిర్మిస్తే అధికారుల నిర్లక్ష్యానికి వాటిని గాలికి వదిలేయడంతో చెత్త, చెదారం పెరుకుపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీసం తాళం కూడా తీయలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఇనాగ్రేషన్ చేయలేదనే సాకుతో?

ఎమ్మెల్యేతో నూతన భవనాలను ఇనాగ్రేషన్ చేయలేదనే సాకుతోనే అధికారులు పంచాయతీ నూతన భవనాలను ఓపెన్ చేయడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచుల పదవి కాలం ఉన్నప్పుడే ప్రారంభించినా.. అధికారులు వాటిని ఎందుకు ఓపెన్ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నూతన భవనాలను ఓపెన్ చేసి పాలనను సాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాళం కూడా తీయడం లేదు



సర్పంచుల పదవి కాలంలోనే నూతన జీపీలను ప్రారంభించాం. అయితే ఆ భవనాలను పంచాయతీ కార్యదర్శులు ఓపెన్ చేయకుండా పాత భవనాలలోనే పాలనను సాగిస్తూ పబ్బం గడుపుతున్నారు. కనీసం తాళం కూడా తీయడం లేదు. ఎందుకు వాడుకోవడం లేదని ఎంపీఓను ప్రశ్నిస్తే రాజకీయ ఒత్తిడి ఉందంటూ తప్పించుకుంటున్నారు.

– కరణం శ్రీకాంత్‌రావు, మాజీ ఉపసర్పంచ్ మోత్కూర్

బిల్లులు రాలేదని తాళాలు ఇవ్వడం లేదు



నూతన భవనాలను నిర్మించిన మాజీ సర్పంచులు బిల్లులు రాలేదనే ఉద్దేశంతో తాళాలు ఇవ్వకుండా వారి వద్దే ఉంచుకున్నారు. ఈ విషయం జిల్లా పంచాయతీ శాఖ అధికారి డాక్టర్ జయసుధ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకునేలా చర్యలు తీసుకుంటాం.

–మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

త్వరలో పంటలకు సాగునీరు

శరవేగంగా కాల్వలకు మరమ్మతులు



కాల్వలోని మట్టిని, చెట్లను తొలగించిన దృశ్యం

ధారూరు: లక్నాపూర్ ప్రాజెక్టు నుంచి ధారూరు మండలంలోని అంతారం, మోమిన్‌కలాన్, మోమిన్‌ఖుర్దు, రాజాపూర్, నాగారం గ్రామాలతో పాటు వికారాబాద్ మండలంలోని ఐనాపూర్‌కు త్వరలో సాగునీరు అందనుంది. కాల్వల మరమ్మతు పనులు రెండు రోజుల నుంచి ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండా నీరు సాఫీగా ప్రవహించేలా పనులు చేస్తున్నారు. వివరాలు ఇలా.. లక్నాపూర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు దశాబ్దకాలంలో పంటలకు చుక్క నీరు అందని స్థితిలో ఉండేది. నిర్వహణ లోపం, పాలకుల నిర్లక్ష్యంతో కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గత జూన్‌లో మండలంలోని రైతులు, కాంగ్రెస్ నాయకుడు కొత్తగడి మాణిక్‌రెడ్డితో కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన స్పీకర్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఇరిగేషన్ చేవెళ్ల సర్కిల్ ఎస్‌ఈ రంగారెడ్డిలతో చర్చించి మరమ్మతులకు నిధుల ఎస్టిమేట్ చేయించారు. జూలై 3న రూ.18.44 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఇందులో భాగంగా మొదట 9 కిలోమీటర్ల కుడి కాల్వలో పేరుకుపోయిన మట్టి, చెట్లను తొలగించే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ మట్టితీత, జంగల్ కటింగ్ పనులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. తర్వాత పరిగి మండల పరిధిలోని లక్నాపూర్, మిట్టకోడూర్ గ్రామాలకు నీరందించే 12 కిలోమీటర్ల దూరం గల ఎడమ కాల్వను మరమ్మతులు చేయించనున్నారు. ఈ సందర్భంగా వారు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అదనపు బస్సుల కోసం ఆందోళన



అక్కంపల్లిలో బస్సును అడ్డుకున్న విద్యార్థులు

యాలాల: పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకనుగుణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అక్కంపల్లిలో రుద్రారం నుంచి తాండూరుకు వస్తున్న బస్సును ఆపి ఆందోళన చేపట్టారు. రుద్రారం నుంచి జుంటుపల్లి, అక్కంపల్లి, చెన్నారం, లక్ష్మీనారాయణపూర్ మీదుగా బస్సు తాండూరుకు వెళ్తుంది. ఈ మార్గంలో ఉదయం వేళ ఒకే సర్వీసు ఉండటంతో విద్యార్థులతో పాటు సాధారణ ప్రయాణికులు, వ్యాపారస్తులతో బస్సు నిండిపోతుంది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సులో కాలుపెట్టడానికి కూడా చోటు ఉండదని పలువురు విద్యార్థులు వాపోయారు. ఈ మార్గంలో ఉదయం, సా యంత్రం వేళ అదనపు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న స్వప్న

తాండూరు టౌన్ : తాండూరు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 4, 15వ వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో పలు అవాంతరాలతో అభివృద్ధి పనులు కొనసాగించలేకపోయామన్నారు. ఇకపై అలాంటివేమీ ఉండవని, మున్సిపల్ నిధులతోనే కాకుండా, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధులతో కూడా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శోభారాణి, అస్లాం, రవిరాజు, వెంకన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాలా తదితరులు పాల్గొన్నారు.

‘సమగ్ర’ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి



ఉద్యోగుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

యాలాల: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి, రూ.10 లక్షల జీవిత బీమా ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని యాలాల కేజీబీవీ ఎస్‌ఓ మంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కేజీబీవీ ఆవరణలో ఇటీవల పని ఒత్తిడితో మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. ఎస్‌ఓ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. తక్కువ వేతనంతో కుటుంబాన్ని పోషించ డం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితోనే ఇటీవల గుండెపోటుతో అంజుమ్, నాగమణి, మాణిక్యమ్మ మృతి చెందారని ఆరోపించారు.

తాండూరు రూరల్‌లో..

మండలంలోని జినుగుర్తి కేజీబీవీలో మృతి చెందిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు నివాళులర్పించారు. పనిభారం, పని ఒత్తిడితో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు మృతి చెందడం తీవ్ర బాధకరమన్నారు. క్రమబద్ధీకరణ చేసి, పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం పూర్తిగా విఫలం



పరిగి: నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

పరిగి: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆ సంఘం సభ్యులు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట ఇటీవల మరణించిన ఉద్యోగుల చిత్రపటాలకు నివాళులర్పించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. ఉద్యోగ భద్రత, సరైన పనికి సరైన వేతనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

కనకదుర్గా మల్లేశ్వర స్వామిగా పరమశివుడు



తాండూరు టౌన్ : శ్రావణ మాసం రెండో సోమవారం పురస్కరించు కుని తాండూ రు పట్టణంలో ని భావిగి భద్రేశ్వరస్వామి శివాలయంలో పరమశివుడు కనకదుర్గా మల్లేశ్వరస్వా మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



హకీంపేటలో సాగుతున్న రోడ్డు పనులు

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండలంలోని కుదురుమల్ల గ్రామం నుంచి పోలేపల్లి గ్రామ శివారు వరకు రూ. 50 కోట్లతో నెల రోజుల క్రితం నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో కాంట్రాక్టర్లు రోడ్డును త్వరగా పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. అందులో భాగంగా రోడ్డుకు ఇరువైపుల మట్టితో లెవలింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

కురువలను ఎస్సీలుగా గుర్తించాలి

అనంతగిరి: కురువలను ఎస్సీలుగా గుర్తించి, సర్టిఫికేట్లు ఇవ్వాలని తాండూరు మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురువలుగా పిలవబడే మదాసి, మదారిలకు ఎస్సీ కుల (క్రమసంఖ్య 30) సర్టిఫికేట్లు ఇవ్వాలన్నారు. కురుమ, కురుబలుగా గుర్తించి బీసీ కుల (సీరియల్ నంబర్ 11)ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని వాపోయారు. బీసీలుగా గుర్తించి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో తాండూర్ డివిజన్ మాదాసి, మాదరి కురువ సంఘం ఉపాధ్యక్షుడు పూజారి పాండు, ఒగ్గు జానపద డోలు కళాకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు, మల్లప్ప, సాయిలు, మైపాల్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై విచారణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైద్యనాథ్‌పై విచారణ చేపట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి పండరి ఫిర్యాదు మేరకు సోమవారం ఎంఈఓ వెంకటయ్య విచారణ చేపట్టారు. మాజీ సర్పంచు విజయలక్ష్మితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ .. పాఠశాల నిధులు, ఐసీఎల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే పాఠశాల అభివృద్ధి నిధులు, పలు విషయాలపై విచారణ చేశారు. ఈ నివేదికను డీఈఓకు అందజేస్తానని ఎంఈఓ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పెద్దేముల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాల్లో గెలుపొందడం ఖాయమని జిల్లా పార్టీ అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల నర్సాపూర్ గ్రామంలో బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రూపులేకుండా పోతాయన్నారు. రాష్ట్రంలో తాండూరు కంది పప్పుకు మంచి పేరుంది.. కావునా, ఇక్కడ కంది బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. త్వరలో రోడ్ల మరమ్మతులపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబపాలనతో పదేళ్లు ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని విమర్శించారు. తట్టెపల్లిని మండలకేంద్రంగా ప్రభుత్వం ప్రకటించే వరకు వదిలేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఎస్‌సీఆర్‌ఎంయూ నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

తాండూరు టౌన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం తాండూరు రైల్వే స్టేషన్ ఎదుట రైల్వే ఉద్యోగులు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం రైల్వే ఉద్యోగులు, కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయని యెడల ఎస్‌సీఆర్‌ఎంయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సహ కార్మికుడికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌ఎంయూ బ్రాంచ్ కార్యదర్శి కాశీశ్వర్, చైర్మన్ శ్యాంచవాన్, వైస్ చైర్మన్ అశోక్‌గౌడ్, సహ కార్యదర్శి బాబూలాల్, రిచర్డ్‌సన్, యూత్ సెక్రటరీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు రాక వెలవెలబోయింది. అధికారులు సమయానికి వచ్చి కూర్చున్న ఫిర్యాదులు రాకపోవడంతో మధ్యాహ్నం వరకు వేచి చూశారు. గత రెండు వారాల నుంచి ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, పీఆర్ఎఈఈ ప్రణీత్‌కుమార్, పశువైద్యాధికారి గీత, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

బంట్వారం: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సోమవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని నాగవరానికి చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ దరఖాస్తును పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వేణుమాధవ్, ఐకేపీ ఏపీఎం దేవయ్య పాల్గొన్నారు.

ప్రజావాణితో ప్రయోజనం

మర్పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమా న్ని నిర్వహిస్తుందని ఎంపీడీఓ రాజ్ మల్ల య్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం లో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నాలు గు దరఖాస్తులు పెట్టుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. ఉచిత కరెంట్ (జీరో బిల్లు) రానివారు మండల పరిషత్ కార్యాలయంలోని కౌంటర్‌లో ఇంటి మీటర్ బిల్లుతో పాటు ఆధార్‌కార్డు, ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు రశీదు తీసుకువస్తే జీరో బిల్లు కోసం ఆన్‌లైన్ చేస్తామన్నా రు. కార్యక్రమంలో తహసీల్దార్ముని రొడ్డీస్, వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎం మధుకర్, మార్కెట్ సూపర్‌వైజర్ పెంటయ్య, తదితరులు ఉన్నారు.

1930కి ఫోన్ చేయండి

సీఐ ఆంజనేయులు



మాట్లాడుతున్న సీఐ

మోమిన్‌పేట: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఆటోతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు నాలుగు గ్రామాల్లో అవగాహన చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుండటంతో అమాయకులను సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఖాతాలను ఖాళీ చేస్తా రని చెప్పారు. బ్యాంకు సిబ్బంది మీ ఖాతాకు సంబంధించిన ఎలా ంటి సమాచారం కోరదన్నారు. లింకులు పంపడం, ఓటీపీ చెప్పండని ఖాతాలోని డబ్బులను ఖాళీ చేస్తున్నారని వివరించారు. మీ ఖాతా నుంచి డబ్బులు వెళ్లిన వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అరవింద్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రిటైర్డ్ డీఎస్పీకి సన్మానం

పూడూరు: పుట్టిన ఊరు కన్నతల్లి లాంటిదని గ్రామానికి ఎంత చేసినా తక్కువేనని రిటైర్డ్ డీఎస్పీ బంటు రాములు అన్నారు. సోమవారం మండలంలోని కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కొరత ఉండటంతో ఆయన సొంత ఖర్చుతో విద్యావాలంటీర్లను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో చదువుకోవాలంటే సౌకర్యాలు ఉండేవికావని, చాలా మంది మధ్యలోనే చదువు ఆపేశారని అన్నారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలనే ఉద్దేశంతో తాను పాఠశాల చదువును ప్రోత్సాహిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్, పాఠశాల హెచ్‌ఎం మోజెస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పోస్టాఫీసులో జాతీయ జెండాలు

కుల్కచర్ల: ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమానికి అవసరమైన జాతీయ జెండాలను తపాల కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు కుల్కచర్ల తపాల కార్యాలయం సహాయ పర్యవేక్షకులు కొత్త వెంకట్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ జెండాలను కేవలం రూ.25లకే ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరి వెంకటేష్, తపాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ అర్హులకు రుణమాఫీ

దోమ : గ్రామాల్లో అర్హులైన రైతులందరికీ రుణమాఫీని వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా రుణమాఫీ చేసింది. కాని, కొంత మంది రైతులు నేటికి మాఫీ కాలేదన్నారు. వారు బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి రైతుకు మాఫీ వర్తింపజేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు.

◆ భద్రేశ్వరుడికి పూజలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మేడిచెట్టుతండా పంచాయతీ పరిధిలోని బోడబండతండాలో సోమవారం సేవాలాల్ యువజన సంఘం ఆధ్వర్యంలో వీరభద్రస్వామి గుట్టపై శివపూజలు చేశారు. సకాలంలో వానలు కురవాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలంటూ మొక్కుకున్నారు. ఇందులో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.